క్లుప్తంగా

భారీ అన్నసమారాధన


అన్నసమారాధన ప్రారంభిస్తున్న కెకె రాజు

కంచరపాలెం: జీవీఎంసీ 47వ వార్డు కంచరపాలెం రాంజీ ఎస్టేట్‌లో నూకాంబిక అమ్మవారి ఉత్సవాల్లో భాగంగా ఆలయ ఆవరణలో మంగళవారం భారీ అన్నసమారాధన కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కెకె రాజు ప్రారంభించారు. సుమారు 3వేల మందికి అన్నసమారాధన చేసినట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో ఎన్నికల పరిశీలకులు చొక్కాకుల వెంకటరావు, కార్పొరేటర్ కామేశ్వరి, వసంతల అప్పారావు, పి. సాయి, వి.జయ, కుమార్, రాజు, రమణ, కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు


సీతంపేట కూడలిలో మజ్జిగ పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్

సీతంపేట: స్థానిక సీతంపేట కూడలిలో దుర్గాగణపతి ఆలయం వద్ద యశోదకృష్ణ సేవా సంఘం ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. 25వ వార్డు కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ ముఖ్య అతిథిగా చలివేంద్రం ప్రారంభించారు. అందరికీ మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ముద్దాడ శంకర్, బీసపు శ్రీను, బొట్టా అరుణ్, ముగడ విజయ్, కిలాని గణేష్, బర్ల ప్రసాద్, ఉప్పిలి అప్పన్న, జోగా శ్రీధర్, ఒమ్మి ఆనంద్, అల్లు అప్పలసూరి, మన్యాల శ్రీను, చిన్ని వాసు, ఉప్పిలి సూరిబాబు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా సీతారాముల నవరాత్రి మహోత్సవాలు


ఉత్సవాల్లో పాల్గొన్న కేకే రాజు

సీతంపేట: జీవీఎంసీ 25వ వార్డు సీతంపేటలో సింహాచలం దేవస్థానం ట్రస్టు బోర్డు మెంబర్ సంపంగి శ్రీనివాసరావు, మంగమ్మ దంపతులు ఆధ్వర్యంలో మంగళవారం సీతారామ కల్యాణ వసంత నవరాత్రి మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికిముఖ్య అతిథిగా వైఎస్సార్‌సీపీ విశాఖ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు పాల్గొని పూజలు చేశారు. అర్చకుల వేదమంత్రాల నడుమ సీతారాముల ఉత్సవ మూర్తులకు మంగళస్నానాలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ మూర్తులను అలంకరించి మేళతాళాలతో ఊరేగింపుగా పార్వతీశ్వరాలయానికి తీసుకువెళ్లారు. 25వవార్డు కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్, 14వ వార్డు కార్పొరేటర్ కె.అనిల్‌కుమార్ రాజు పాల్గొన్నారు.

ప్రగతి పథం


ధర్మానగర్‌లో రహదారులు(నాడు)


ధర్మానగర్‌లో సీసీ రోడ్ల నిర్మాణం (నేడు)



రెడ్డి కంచరపాలెంలో సీసీ రోడ్డు నిర్మాణం, జాషువానగర్‌లో డ్రైనేజీలు

- 55వ వార్డులో శరవేగంగా అభివృద్ధి
- అధ్వాన స్థితి నుంచి ఆధునికీకరణ వైపు అడుగులు
- సమకూరిన మౌలిక వసతులు
- ఆనందం వ్యక్తం చేస్తున్న ప్రజలు

కంచరపాలెం: జీవీఎంసీ 55వ వార్డు కంచరపాలెం పరిధి రెడ్డికంచరపాలెం, జాషువానగర్, అశోక్‌నగర్, కొత్త రెడ్డికంచరపాలెం, జోగారావునగర్, యల్లబిల్లివారివీధి, తిక్కవానిపాలెం, ధర్మానగర్ ప్రాంతాల్లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక చాలా సమస్యలు పరిష్కారమయ్యాయి. గత టీడీపీ ప్రభుత్వంలో అభివృద్ధి పడకేయగా..వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నాలుగేళ్లలో అనేక అభివృద్ధి పనులు వార్డులో నిర్వహించారు. వార్డు రూపురేఖలు మార్చేశారు. నాడు సమస్యలతో ఇబ్బంది పడితే..నేడు సౌకర్యాలతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో సీసీ, బీటీ రోడ్లు గుంతలమయంగా మారడంతో పాదచారులు నానా ఇబ్బందులు పడేవారు. సడక మార్గాలు అధ్వానంగా ఉండడంతో మౌలిక వసతులు కల్పించడానికి కష్టతరంగా మారాయి. ఎన్నో ఏళ్లుగా వృద్ధులు, పిల్లలు, దివ్యాంగులు శిథిలావస్థమార్గాల్లో అవస్థలు పడ్డారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో ఎన్ని ఫిర్యాదులు చేసినా పట్టించుకోలేదు. ఇక వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక రెండేళ్లలోనే సుమారు రూ 1.37 కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులు చేపట్టారు. వార్డు కార్పొరేటర్, జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు శశికళ కౌన్సిల్‌లో నిధులు మంజూరు చేయించుకుని అభివృద్ధికి కృషికి చేశారు. 85 శాతం పలు అభివృద్ధి పనులకు మోక్షం కల్గింది. నగర మేయర్ హరి వెంకట కుమారి, వార్డు కార్పొరేటర్ శశికళ కృషితో గెడ్డలకు రక్షణ గోడలు, సీసీ, బీటీ రోడ్లు, డ్రైనేజీలు, కాలువలు తదితర మౌలిక వసతులు సమకూరాయి. వార్డులో సమస్యల పరిష్కారం కావడం, అభివృద్ధి పనులు చురుగ్గా సాగుతుండడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


తిక్కవానిపాలెంలో సీసీ, డ్రైనేజీలు(నాడు)


తిక్కవానిపాలెంలో సీసీ రోడ్ల నిర్మాణం(నేడు)

55వ వార్డులో అభివృద్ధి పనులకు మంజూరు చేసిన నిధులు, నిర్మాణ పనులు ఇలా..

వార్డులో ప్రాంతాలు	అభివృద్ధి పనుల	నిధులు
జాషువానగర్	సీసీ రోడ్లు, బీటీరోడ్లు	రూ.18.52లక్షలు
కొత్తరెడ్డి కంచరపాలెం	డ్రైనేజీలు, బీటీరోడ్లు	రూ.14.58లక్షలు
అశోక్‌నగర్	గెడ్డలు, డ్రైనేజీలు	రూ.16.39లక్షలు
రెడ్డికంచరపాలెం	కాలువలు, సీసీ రోడ్లు	రూ.21.98లక్షలు
జోగారావునగర్	బీటీ రోడ్లు, కాలువలు	రూ.17.20లక్షలు
ధర్మానగర్	సీసీ రోడ్లు, డ్రైనేజీలు	రూ.22.55లక్షలు
తిక్కవానిపాలెం	బీటీ, సీసీరోడ్లు, కాలువలు	రూ.26.03లక్షలు

శరవేగంగా అభివృద్ధి



ఎన్నో ఏళ్లుగా అశోక్‌నగర్‌లో నివాసం ఉంటున్నాం. గత ప్రభుత్వ హయాంలో వార్డులో మౌలిక వసతులు, అభివృద్ధి కనిపించలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక వార్డు ఎంతో అభివృద్ధి చెందింది. మౌలిక వసతులూ సమకూరాయి. జీవీఎంసీ పుష్కలంగా నిధులు మంజూరు చేయడంతో అభివృద్ధి జరిగింది.
– బాలాజీ, అశోక్‌నగర్

మౌలిక సదుపాయాలు సమకూరాయి



రాష్ట్ర ప్రభుత్వం, జీవీఎంసీ కృషి ఫలితంగా వార్డులో అనేక సమస్యలు పరిష్కారమయ్యాయి. ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో ఏళ్లనాటి అభివృద్ధి పనులకు మోక్షం లభించింది. శిథిలావస్థ నుంచి స్మార్ట్ వార్డ్‌గా అభివృద్ధి చెందింది. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుంటాం.
– కాయిత వెంకటలక్ష్మి, కంచరపాలెం

ప్రజల సహకారంతో అభివృద్ధి



మురికివాడలు అభివృద్ధి చేయడం ఎంతో కష్టతరంతో కూడిన పని. ప్రభుత్వం, జీవీఎంసీ, ఎంపీ నిధులు మంజూరు కావడంతో వార్డును అభివృద్ధి పథంలో ముందుకు దూసుకుపోతోంది. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎంను చేసుకుంటాం.
– కేవీఎస్ శశికళ, కార్పొరేటర్

నూకాంబిక అమ్మవారి ఉత్సవంలో కేకే రాజు


దర్శనంలో పాల్గొన్న కేకే రాజు

మద్రిపాలెం: జీవీఎంసీ 50వ వార్డులో శ్రీ నూకాంబిక అమ్మవారి పండగ ఉత్సవాలు నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కేకే రాజు సత్యనగర్, సాయిరామ్‌నగర్‌లో నిర్వహించిన శ్రీ నూకాంబిక అమ్మవారి పండుగ మహోత్సవంలో వార్డు కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్‌తో కలిసి పాల్గొన్నారు.

సంగీత సమితి ప్రారంభం


సంగీత సంస్థను ప్రారంభిస్తున్న ప్రసాద్

సీతంపేట: ఐవీఎల్ శాస్త్రి సంగీత సమితి పేరిట నూతన సంగీత సంస్థ శంకరమఠంలో ప్రముఖుల సమక్షంలో ఘనంగా ప్రారంభమైంది. కళాభారతి కార్యదర్శి డాక్టర్ జి.ఆర్.కె.ప్రసాద్ జ్యోతిని వెలిగించి నూతన సంగీత సంస్థను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖలో సంగీత జనకులం స్థాపించి తద్వారా శాస్త్రీయ సంగీత వైభవానికి స్వర్గీయ ఐవీఎల్ శాస్త్రి చేసిన మహోన్నత సేవలను కొనియాడారు. శంకరమఠం అధ్యక్షుడు డాక్టర్ టి.రవిరాజు మాట్లాడుతూ సంగీత జనకులం అనే సంగీత పాఠశాలనుస్థాపించి వందలాది మందికి శాస్త్రీయ సంగీతంపై చక్కని అవగాహన కల్పించిన ఘనత ఐవీఎల్ శాస్త్రికే దక్కుతుందన్నారు. సంగీత కళాకారులు పి.గోపాలరావు, కె.సరస్వతి విద్యార్థి, వి.వి.రమణమూర్తి, డి.త్యాగరాజు, ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త ఎం.వి.రాజశేఖర్, వి.వి.బి. శంకరం పాల్గొని ఐవీఎల్ శాస్త్రి సంగీత సేవలను కొనియాడారు. ఐవీఎల్ శాస్త్రి సంగీత సమితి గౌరవాధ్యక్షులు ఐ.రామచంద్రమూర్తి, అధ్యక్షుడు ఆకొండి వెంకటరావు, కార్యదర్శి పి.జగన్‌మోహన్‌రావు, కోశాధికారి జి.మధుబాబు, సంగీత సంస్థ శిష్య బృందం పాల్గొన్నారు.

ఉత్తరాంధ్ర ద్రోహులను తరిమికొట్టాలి


ఉగాది వేడుకల్లో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ ఉత్తర ఎమ్మెల్యే అభ్యర్థి కేకే రాజు

- వైఎస్సార్‌సీపీ ఉత్తర ఎమ్మెల్యే అభ్యర్థి కేకే రాజు

సీతమ్మధార : జీవీఎంసీ 14 వార్డు బాలయ్యశాస్త్రిలే అవుట్‌లోని వైఎస్సార్‌సీపీ విశాఖ ఉత్తర నియోజకవర్గం పార్టీ కార్యాలయంలో ఉగాది సంబరాలు ఘనంగా నిర్వహించారు. ముందుగా ఉత్తర ఎమ్మెల్యే అభ్యర్థి కేకేరాజు పార్టీ కార్యాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. వేదపండితులు పంచాంగ శ్రవణం చేశారు. ఈసందర్భంగా చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా కేకేరాజు మాట్లాడుతూ ఉగాది పర్వాదినాన ఉత్తరాంధ్ర ద్రోహులను ఓటు హక్కుతో తరిమికొట్టాలన్నారు. దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి హయాంలో ఉత్తరాంధ్రకు అధిక ప్రాధాన్యత ఇస్తే..గత టీడీపీ ప్రభుత్వం ఉత్తరాంధ్ర వెనుకబాటుతనానికి కారణమైందన్నారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఉత్తరాంధ్ర అభివృద్ధి బాధ్యత తీసుకున్నారని చెప్పారు. చంద్రబాబు ఇప్పటికీ అమరావతి జపం చేస్తూనే ఉన్నాడని, ఉత్తరాంధ్ర అభివృద్ధికి ఏనాడూ సహకరించలేదని విమర్శించారు. ఇప్పుడు ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో బీజేపీ, జనసేనతో కలిసి టీడీపీ కుటిల రాజకీయాలను తెరలేపుతోందని, వాటిని ఉత్తరాంధ్రవాసులు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వీకేపీసీపీ ఐఆర్ చైర్మన్, ఉత్తర నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు చొక్కాకుల వెంకటరావు, వీఎంఆర్డీఏ చైర్మన్ సనపల చంద్రమౌళి, కళా హస్పటల్ అధినేత డా.పి.వి.రమణమూర్తి, డిప్యూటీ మేయర్ కట్టుమూరి సతీష్, సీనియర్ నాయకులు జీవీ రవిరాజు, కాశీ విశ్వనాథ్, సతీష్ వర్మ,ఉత్తర పరిశీలకులు బాణాల శ్రీనివాసరావు, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కంపా హనూక్, అల్లు శంకరావు, స్టాండింగ్ కమిటీ మెంబర్ కంటిపాము కామేశ్వరి, కార్పొరేటర్లు కె.అనిల్‌కుమార్‌రాజు, సాడి పద్మారెడ్డి, సారిపల్లి గోవింద్, ఆళ్ల లీలావతి, పి.ఉషశ్రీ, రెయ్యి వెంకటరమణ, కేవీఎస్ శశికళ, జిల్లా యువజన విభాగం అధ్యక్షులు ఆళ్ల శివగణేష్, రాష్ట్ర యూత్ వింగ్ ప్రధాన కార్యదర్శి సునీల్‌కుమార్, వార్డు అధ్యక్షుడు నీలి రవి, పైడి రమణ, కిరణ్‌రాజు, డైరెక్టర్లు, జేసీఎస్ మండల కన్వీనర్లు, ఇన్‌చార్జులు, వార్డు మహిళా అధ్యక్షులు, యువజన విభాగం నాయకులు తదితరులు పాల్గొన్నారు.


పూజలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కేకేరాజు, చిత్రంలో పార్టీ పరిశీలకుడు చొక్కాకుల వెంకటరావు

ఉగాది వైభవం


యోగ సిద్ధాంజనేయుడు


సత్కారం పొందిన కవులు, రచయితలతో అతిథులు

సీతంపేట: తెలుగు సంవత్సరాది ఉగాది పర్వదినం పురస్కరించుకొని ఉత్తర నియోజకవర్గంలోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. సీతంపేటలోని దుర్గాగణపతి, పార్వతీశ్వరాలయం, గురుదత్తసాయి ఆలయం, అక్కయ్యపాలెంలోని శ్రీలలితా పీఠం, షిర్డీసాయి మందిరం భక్తుతో పోటెత్తాయి. ఉదయం నుంచే ఆలయాల వద్ద భక్తులు బారులు తీరారు. ఈ సందర్భంగా దుర్గాగణపతి ఆలయంలో గణపతి హోమం, పంచామృతాభిషేకం, సహస్రనామార్చన, ప్రత్యేక అలంకరణ గావించారు.


లలితాపీఠంలో పంచాంగ శ్రవణం

శ్రీలలితాపీఠంలో...

స్థానిక లలితాపీఠంలో ఉగాది వేడులను ఘనంగా నిర్వహించారు. పీఠాధిపతి సిద్దేశ్వరానంద భారతీ మహాస్వామి ఆశీస్సులతో లలితాకామేశ్వరి అమ్మవారికి క్షీరాభిషేకం, అనంతరం బంగారు చీర అలంకర చేసారు. వసంత నవరాత్రి ఉత్సవాలలో భాగంగా సీతారాముల ఉత్సవ మూర్తులకు సహస్ర నామార్చన చేసారు. సాహిత్య విద్యాప్రవీణ కొక్కిరిగడ్డ సూర్యనారాయణమూర్తి పంచాంగ శ్రవణం చేశారు. అనంతరం జరిగిన ఎస్.వి.ఎస్.ఎల్.ప్రసన్న, ఎస్.వి.ఎస్. కృష్ణప్రియచే కర్ణాటక సంగీత కచేరి అలరించింది. సాయంత్రం సాహితీవేత్త పేరి రవికుమార్‌చే రామాయణ విశేషాలతో ప్రవచనం జరిగింది. పరిసర ప్రాంత భక్తులుపెద్ద సంఖ్యలో లలితాదేవిని దర్శించి పూజలు చేసారు. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

మురళీనగర్: మురళీనగర్ పరిసరాల్లోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మురళీనగర్ రామాలయంలో ఉగాది సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. జాతీయ రహదారి సూర్యానగర్–2లో వెలసిన యోగసిద్ధాంజనేయ స్వామి ఆలయంలో అర్చకుడు శ్రీకాంతాచార్యుల ఆధ్వర్యంలో పాంచరాత్ర ఆగమ సంప్రదాయంలో ఉత్సవ మూర్తికి సింధూరం అర్చన, తమలపాకులతో అర్చన, అష్టోత్తర నామావళి నిర్వహించారు. ధూపదీప నైవేద్యాలను సమర్పించి భజనానంద హారతి నిర్వహించారు. ఈ సందర్భంగా యోగసిద్ధాంజనేయుడు జాంబవంత సహిత హనుమంతుడిగా దర్శనమిచ్చారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకుడు పి.సుబ్బరాజు, ఆధ్యాత్మిక వేత్త ఎంవీ రాజశేఖర్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఫుడ్ కార్నివాల్

మురళీనగర్ వైశాఖి స్పోర్ట్స్ పార్కులో మంగళవారం సాయంత్రం నిర్వహించిన ఉగాది సంబరాలు ఉత్సాహంగా నిర్వహించారు. పార్కు అధ్యక్షుడు సనపల వరప్రసాద్, కార్యదర్శి పీవీఎస్ రాజుల పర్యవేక్షణలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో స్థానికులు అత్యధిక సంఖ్యలో పాల్గొన్నారు. పంచాంగ శ్రవణం అనంతరం గోదావరి రుచులతో కూడిన ఫుడ్ కార్నివాల్‌కు విశేష ఆదరణ లభించింది. షాపింగ్ మాల్స్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బాలబాలికలు ప్రదర్శించిన సాంప్రదాయ నృత్య ప్రదర్శన, కోలాటం, జానపద నృత్య ప్రదర్శన ఆకట్టుకున్నాయి.

వైభవంగా సుప్రభాత సేవ

కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఉగాది సందర్భంగా వైభవుడికి సుప్రభాత సేవ నిర్వహించారు. సన్నిధి గొల్ల నిర్వహించి స్వామికి సుప్రభాతం చదివి వినిపించారు. ఆలయ అర్చకుడు శేషాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో భాగంగా స్వామిని వెండి బుట్ట కిరీటం, బంగారు పాదాలు, బంగారు పంచెతో ప్రత్యేంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. మహిళల కోలాటం ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. స్థానిక అర్చకుడు శేషాచార్యులు పంచాంగ శ్రవణం వినిపించారు. ఆలయ ఈవో బండారు ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

అలరించిన కవితా గోష్ఠి

సీతంపేట: అఖిల భారతీయ సాహిత్య పరిషత్ ఆధ్వర్యంలో స్థానిక బీవీకే కళాశాలలో ఉగాది వేడుకలు ఘనంగా జరిగాయి. ఈసందర్భంగా జరిగిన కవితా గోష్ఠికి ప్రముఖ రచయిత డాక్టర్ డి.వి.సూర్యారావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఏపీ ఈస్టర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ విశ్రాంత చీఫ్ జనరల్ మేనేజర్ పి.యస్.కుమార్ ఉగాది ప్రాశస్త్యాన్ని వివరించి, తెలుగు వారి ఉగాది ఆచార వ్యవహారాలను, మన సంస్కృతి వైశిష్ట్యాన్ని వివరించారు. డాక్టర్ యం.విజయగోపాల్ సాహిత్యంలో జాతీయ దృక్పథం ఆవశ్యకతను విశదం చేశారు. కవితా గోష్ఠిలో దామరాజు విశాలాక్షి డాక్టర్ కె.వి.ఎస్.మూర్తి, సి.హెచ్.నిర్మల, కుప్పిలి భీమేశ్వరరావు తదితర కవులు పాల్గొని కవితా గానం చేశారు.


ఆకట్టుకున్న మహిళల కోలాటం


మాట్లాడుతున్న రచయిత సూర్యారావు


ఆకట్టుకున్న ఫుడ్ కార్నివాల్

కవులకు సత్కారం

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం పోర్టు అథారిటీ – సాగరి ఆధ్వర్యంలో సాలగ్రామపురంలో గల సీతారామ కళ్యాణమండపంలో ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో వీపీఎఫ్‌ఏ అండ్ సీఏవో డి.రమణమూర్తి ముఖ్యఅతిథిగా పాల్గొని నూతన సంవత్సరం అందరి జీవితాల్లో వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. అనంతరం కవులు, రచయితలను ఘనంగా సత్కరించారు. పండిట్ అడపాల సత్యనారాయణ పంచాంగ శ్రవణం చేశారు. నృత్య భారతి అకాడమికి చెందిన చిన్నారులు అద్భుతమైన నృత్యప్రదర్శన చేశారు. సీనియర్ అకౌంట్స్ అధికారి సందీప్, ఫ్రాన్సిస్, పి.రాజేంద్రప్రసాద్, కనకమహాలక్ష్మి, అవతారం నాయుడు, ధర్మారావులు పాల్గొన్నారు.

బాబా ఆలయంలో ......

సీతమ్మధార : సీతమ్మధార నార్త్‌ఎక్స్‌టెన్షన్‌లోని దేవాదాయ ధర్మదాయ శాఖ శ్రీ మహగణపతి, ప్రసన్న వేంకటేశ్వర స్వామి, అయ్యప్ప , శ్రీ షిర్డీ సాయి బాబా ఆలయంలో ఉగాది సందర్భంగా బాబాకు ప్రధాన అర్చకులు రాజాస్వామి ఆధ్వర్యంలో క్షీరాభిషేకం నిర్వహించారు.

గణేష్‌నగర్‌లో..

జీవీఎంసీ పరిధి 14 వార్డులోని శ్రీశ్రీశ్రీ త్రిముఖ విఘ్నేశ్వర దేవాలయంలో మంగళవారం ఉగాది పురస్కరించుకొని ఆలయ అర్చకుడు ఏడిద గురునాథ్ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పంచాంగ శ్రవణం నిర్వహించారు. అనంతరం ఆలయం ఆవరణలో కోలాటం ప్రదర్శన నిర్వహించారు.

నవ్వులు కురిపించిన 'చల్ చల్ గుర్రం'

మురళీనగర్: మురళీనగర్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో మురళీనగర్ వాకర్స్ పార్కు ఆవరణలో మంగళవారం సాయంత్రం ఉగాది వేడుకలు సాంప్రదాయ సిద్ధంగా నిర్వహించారు. క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. సుసరావు చంద్రశేఖ శర్మ పంచాంగ శ్రవణం నిర్వహించారు.

అనంతరం విశాఖ సాయి స్నేహ క్రియేషన్స్ ఆధ్వర్యంలో ప్రముఖ రంగస్థల, సినీ నటుడు ఎస్.కె. మిశ్రో, మిశ్రో ప్రియశిష్యుడు ప్రముఖ రంగస్థల, సినీ నటుడు మాచిరాజు నారాయణరావును వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి చేతుల మీదుగా సత్కరించారు. మాచిరాజు నారాయణరావు సమర్పణలో ప్రముఖ నటులు ఎస్.వి.ఎల్.ఎన్ ప్రసాద్ 'మిమిక్రి', ఆకట్టుకుంది. ఎస్.వి.ఎల్.ఎన్ ప్రసాద్ దర్శకత్వంలో ప్రదర్శించిన ప్రముఖ రచయిత, ప్రఖ్యాత సినీ నటుడు తనికెళ్ళ భరణి రచించిన చల్‌చల్ గుర్రం హాస్య నాటిక నవ్వులు కురిపించింది. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి పి.చెల్వరాజు, వాకర్స్ ఇంటర్నేషనల్ అదనపు కార్యదర్శి ఆర్.సత్యనాథం, 101 ఎలెక్ట్ గవర్నర్ కె.ద్వారకానాథ్, పూర్వ అధ్యక్షులు, ఇతర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సినీ నటుడు ఎస్.కె.మిశ్రో

శ్రీరామనవమికి ఏర్పాట్లు

మద్రిపాలెం: శ్రీరామనవమి పురస్కరించుకుని హరిహర క్షేత్రంలో శ్రీరామచంద్ర మూర్తి ఆలయంలో పందిరిరాట మహోత్సవం నిర్వహించారు. అనంతరం ఉగాది సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శివయ్య, శ్రీరాముని మందిరంలో విశేష పూజలు నిర్వహించారు.


పందిరిరాట వేస్తున్న మహిళలు

ధ్యానమందిరంలో అన్నదాన వార్షికోత్సవం

తాటిచెట్లపాలెం: రైల్వేన్యూకాలనీ, రైల్వే ఎగ్జిబిషన్ గ్రౌండ్ ఎదురుగా గల షిర్డీసాయిబాబా ధ్యాన మందిరంలో మంగళవారం 14వ అన్నదాన వార్షికోత్సవం, ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉగాది సందర్భంగా ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు స్వహస్తాలతో సాయిబాబాకు వెయ్యి లీటర్ల పాలతో క్షీరాభిషేకం చేశారు. అనంతరం నవగ్రహారాధన, నవగ్రహ హోమం జరిగాయి. మధ్యాహ్న హారతి అనంతరం ధ్యానమందిరంలో అన్నదానం ప్రారంభించి 14ఏళ్లు పూర్తయిన సందర్భంగా సుమారు 500మందికి మహా అన్నదానం నిర్వహించారు. రాత్రి 7గంటల నుండి పంచాంగ శ్రవణం, బాబా గీతాలాపన నిర్వహించారు. ఏర్పాట్లను ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు నూకల శేషగిరిరావు, త్రిపురాన రాంబాబు, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.